## రిపోర్టర్లు కావలెను

ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు

9908862557



జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ప్రకాశం



జిల్లా వార్తలు

శనివారం | 28-2-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 605 పేజీలు: 2 వెల : రూ.7


## ప్రజా సమస్యలపై..

# ప్రశ్నిస్తునే ఉంటా

* ఇది నా వ్యక్తిగతం.. పార్టీకి సంబంధం లేదు
* మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి
* జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం

**ఒంగోలు, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** ప్రజా సమస్యలపై తాను ఎల్లప్పుడూ ప్రశ్నిస్తునే ఉంటానని, ఇది తన నైజం అని, రాజకీయ పార్టీలకు సంబంధం లేదని మాజీ మంత్రి, జనసేన పార్టీ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒంగోలులోని తన నివాసంలో శుక్రవారం బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో 100 కోట్లు అవినీతి జరిగిందన్నారు. దాంట్లో మా అబ్బాయికి సంబంధం అని వార్తలు రాశారన్నారు. డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవినీతి




అక్రమాలు, వైసీపీలో ఉన్నప్పుడు జరిగిన వాటి మీద సంవత్సర కాలంగా ఇప్పుడు జరిగిన వాటి మీద విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ స్థలాలు మేము కబ్జా చేశామని ఆరోపణలు చేశరన్నారు. ఇప్పుడు ఆ స్థలాలు ఎవరు కబ్జా చేశారో విచారణ చేయించాలన్నారు. మెప్మాలో జరిగిన అవినీతిని బయట పెట్టాలన్నారు. ఇంట్లో వ్యక్తి లెటర్ రాసి అందరికి పెడితే అతని ఇంటికి తీసుకెళ్ళి రాజీ చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

## మాలకొండ దుకాణాల వేలం ద్వారా

# రూ. 1,86,25,000 ఆదాయం

* గత ఏడాది కంటే 35 లక్షల 20000 పెరిగిన ఆదాయం

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 10 దుకాణాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వీటి ద్వారా రూ.1,86,25000 ఆదాయం లబించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపై కళ్యాణ మండపంలో శుక్రవారం పమిడిపాడు గ్రూప్ దేవాలయం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ వేలం ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 11 దుకాణాలకు గాను 10 దుకాణాలకు వేలం పాటలు జరగగా. స్వామివారికి, అమ్మవారికి సమర్పించు చీరలు, జాకెట్ పీసులు అమ్ముకొను హక్కు పాట మాత్రం సరైన పాట రానందున ఆలయ అధికారులు వాయిదా వేశారు. మిగిలిన 10 దుకాణాలకు వేలం పాటలు పూర్తయ్యాయి. భక్తులు సమర్పించు కొబ్బరిచిప్పలు పాటను చుండూరి కోటేశ్వరరావు రూ. 25,10,000 పాడుకున్నాడు. టోల్ గేట్ పాటను అహోబిలానికి చెందిన తురక సుబ్బరాజు 38,50,000 పాడుకున్నాడు. పాలు, నెయ్యి వసూలు చేసుకునే హక్కు పాటను జాలారి ప్రసాద్ రూ.60 వేలకు, అద్దాలు, ఫొటోలు, పూజాద్రవ్యముల పాటను మహంకాళీ మల్లికార్జునరావు, రూ.36,75,000కు, కొండపైన బొమ్మల అంగడి - 1 పాటను మల్లెబోయిన సుధాకర్ రూ.5,25,000కు, కొండపైన బొమ్మల అంగడి -2 పాటను కామినేని మాధవరావు రూ.3,50,000, కూల్డ్రింక్స్ పాటను దక్కించుకున్నారు. అలాగే ముతకని రమేష్ రూ. 21,45,000, ఫలహారశాల పాటను వంకదారి కొండయ్య రూ.10.75,000కు పాడుకున్నారు. పాదరక్షలు బ్యాగులు భద్రపరుచుకొనే పాటను మంచాల పెదవీరయ్య రూ.13,50,000కు, కొబ్బరికాయలు అమ్ముకునే పాటను పొడపాటి నరసింహం రూ.26,85,000లకు దక్కించుకున్నారు. ఈ పది దుకాణాలకు గత ఏడాది రూ.1,52,05000 ఆదాయం రాగా ఈ ఏడాది 1,86,25,000 ఆదాయం వచ్చింది అంటే గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 34,20,000 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలిపారు.



# అసెంబ్లీలో కరేడు విద్యార్థులు

**ఉలవపాడు, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** అసెంబ్లీ కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉలవపాడు మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దక్కింది. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆహ్వానం మేరకు ఉలవపాడు మండలం కరేడు హైస్కూల్ లో 9వ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణానికి వెళ్లారు. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని, వ్యవసాయ రంగంపై జరుగుతున్న చర్చను సుమారు అరగంట సేపు ప్రత్యక్షంగా తిలకించారు. స్పీకర్ సభను నడిపిస్తున్న విధానం, మంత్రి అచ్చెన్నాయుడు ప్రసంగం, సభ్యుల స్పందన, అక్కడి నియమాలను గమనించారు. అనంతరం విద్యార్థులంతా, అక్కడే ఉన్న శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించే అంశాలు, సభ నిర్వహణ, ఇతర అంశాల గురించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలిసి విద్యార్థులు గ్రూప్ ఫోటో దిగుతూ సందడి చేశారు. కరేడు హైస్కూల్ పీడీ పి.శ్రీనివాసులు, సోషల్ టీచర్ పి.సుబ్బారావులు విద్యార్థులతో కలిసి ఈ పర్యటనలో పాల్గొన్నారు. అలాగే డీ.జే.ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒంగోలు నియోజకవర్గంలోని స్కాలర్షిప్ ద్వారా చదువుతున్న 100 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. బాలల శాసనసభ యాత్ర పేరుతో అసెంబ్లీ సమావేశాలు ఎలా నిర్వహిస్తారో సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు ఎలా చర్చిస్తారో ప్రత్యక్షంగా తిలకించారు. అసెంబ్లీ ఆవరణలో శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావుకు ట్రస్ట్ సభ్యులకు విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. సాంఘిక సంక్షేమం మంత్రి స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్ రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు దామచర్ల నాగ సత్యలత, దామచర్ల అనిషా లక్ష్మితో కలిసి విద్యార్థులు ఫొటోలు తీసుకున్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
ప్రకాశం





## బాలయోగి స్వామి ఆలయ ఆవరణ పరిశుభ్రం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** సింగరాయకొండ మండలం బాలయోగి నగర్‌లోని బాలయోగి స్వామి ఆలయ ఆవరణను పోలీసులు శుభ్రం చేశారు. ఆలయ ఆవరణలో కొందరు మద్యం తాగి అధ్వానంగా మార్చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆప్రాంతానికి వచ్చి పరిశ్రుభం చేశారు. ఎవరైనా ఆలయ ఆవరనలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

## నేడు సింగరాయకొండకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

**సింగరాయకొండ, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** సింగరాయకొండ శ్రీ చైతన్య నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్ లో ఈనెల 14న 6వ తరగతి విద్యార్థి సయ్యద్ తౌషీక్ (11) అనుమానాస్పద మృతిపై న్యాయం కోసం పోరాటం చేస్తున్న వారి కుటుంబానికి అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం మూడు గంటలకు ఆయన మొదటిగా విద్యార్థి చదివిన శ్రీ చైతన్య స్కూల్‌కి వెళ్లనున్నారు. ఆ తర్వాత సరస్వతి కల్యాణ మండపంలో మీడియాతో మాట్లాడతారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వీరారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు విరిగా పాల్గొని తౌషిక్ కుటుంబానికి అండగా నిలవాలని సీపీఐ మండల కార్యదర్శి బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు జాకీర్ కోరారు.

## విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు



**ఉలవపాడు, ఫిబ్రవరి 27(జాతీయవార్త):** కరేడు పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ సహకారంతో కరేడు కాంప్లెక్స్ చైర్మన్ ఆధ్వర్యంలో ఉలవపాడు మండలంలోని అన్ని పాఠశాలలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుండి ముగ్గురు విద్యార్థులు చొప్పున హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ప్రతిభ పరీక్షలో మొదటి పది స్థానాలలో నిలిచిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. మండల స్థాయి ప్రతిభా పరీక్షలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పల్లెపాలెం(పీపీపీ )లో ఐదో తరగతి చదువుతున్న వెయ్యాల తిరుమల ప్రథమ స్థానంలో నిలిచాడు. భీమవరం హెచ్చి పాఠశాలలో చదువుతున్న మెండెం లోకేష్ ద్వితీయ బహుమతి, చాకిచెర్ల హెచ్చి పాఠశాలలో చదువుతున్న టి సుచిత్ర మూడవ బహుమతి సాధించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పున్నేపల్లి శ్రీనివాసులు, అప్పాడి అక్కయ్య, దన్యాసి మురళి మోహన్‌లను మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఏడాది జైలు

**సింగరాయకొండ, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** ఓ చోరీ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్షను విధిస్తూ సింగరాయకొండ కోర్టు పరిధిలో సివిల్ జడ్జి డాక్టర్ వి.లీలా శ్యాంసుందరి తీర్పు ఇచ్చారు. ములగుంటపాడు గ్రామంలోని వెంకటేశ్వర కాలనీలో నివసించే జంపని ఆంజనేయ రాజు (64) 2025 జనవరి 18న తన కుమార్తె, అల్లుడితో కలిసి చెన్నైకు వెళ్లారు. జనవరి 25 రాత్రి తిరిగి ఇంటికి చేరుకోగా, ఇంటి తలుపులు పగలగొట్టబడి ఉండడాన్ని గమనించారు. ఇనుప బీరువా తాళాలు తెరిచి అందులోని సుమారు 6 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.30,000 నగదు దొంగిలించబడినట్లు గుర్తించారు. జనవరి 26న సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఖమ్మం పట్టణానికి చెందిన సంపతి ఉమా ప్రసాద్ (24)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో కోర్టులో హాజరుపరిచారు. దీంతో సివిల్ జడ్జి ఉమాప్రసాద్‌కు జైలుశిక్ష విధించారు.

## కానిస్టేబుల్‌కు గాయం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** సింగరాయకొండ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పాలపర్తి రవికుమార్ ఒంగోలు వెళుతుండగా టంగుటూరు టోల్ ప్లాజా వద్ద అనిల్ అనే వ్యక్తి మోటారుసైకిల్‌పై వచ్చి ఢీకొట్టాడు. రవికుమార్‌కు గాయాలు కావడంతో ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రికి స్థానికులు తరలించారు.

## ముత్యాలపాడు రామాలయానికి ఎంపీ వేమిరెడ్డి ఐదు లక్షల విరాళం

**లింగసముద్రం, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** మండలంలోని ముత్యాలపాడు గ్రామ రామాలయానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 5 లక్షల విరాళం ప్రకటించినట్లు టిడిపి సీనియర్ నాయకులు వేముల గోపాలరావు తెలిపారు. గ్రామ నాయకులు ఇటీవల వేముల గోపాల్ రావు ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి కలిశారు. గుడి విషయమై ఆయన దృష్టికి తీసుకెళ్లగా గుడికి ఐదు లక్షల విరాళం ప్రకటించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కందే మాలకొండయ్య, పద్మారావుపాల్గొన్నారు



# అంగన్వాడీలను దగా చేస్తున్న పాలకులు

*** సమస్యల పరిష్కారానికి 'ఛలో విజయవాడ' కు తరలి రావాలి * సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు * జిల్లా కలెక్టరేట్ వద్ద మూడో రోజు రిలే నిరాహార దీక్ష**



**ఒంగోలు, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** అంగన్వాడీల సమస్యలపై ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన పాలకులు అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించి దగా చేస్తున్నారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు విమర్శించారు. అంగన్వాడీల వేతనాల పెంపు, ప్రీ స్కూల్ బలోపేతం తదితర డిమాండ్లతో జిల్లా కలెక్టరేట్ వద్ద మూడో రోజు శుక్రవారం కూడా రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కందుకూరు, ఉలవపాడు ప్రాజెక్టుల అధ్యక్షులు కె. రాజేశ్వరి, చిడితోటి ఇంద్రావతి అధ్యక్షతన దీక్షలు చేపట్టారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా నాయకురాలు నెరుసుల మాలతి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపించారు. అంగన్వాడీల విషయంలో చిన్నచూపు చూస్తున్నట్లు దుయ్యబట్టారు. అమ్మవడి నుంచే బాలబాలికలకు తల్లిలా ఆలనా పాలనతో పాటు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్వాడీలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నట్లు దునుమాడారు. బడి ఈడు వచ్చే వయసు నాటికి నడక, నడతా నేర్పించే అంగన్వాడీల సమస్యలను పాలకవర్గం నిర్లక్ష్యం చేస్తే సాహించేది లేదన్నారు. మార్చి 2 న చేపట్టే ఛలో విజయవాడ కార్యక్రమంలో అంగన్వాడీల సత్తా నిరూపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కంకణాల రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్‌కు రూ.24,800, ఆయాకు రూ.20,300 వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ్యులు ప్రతి టర్మ్‌లో తమ వేతనాలు, అలవెన్సులు పెంచుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు తో పాటు,చిరుద్యోగులుగా ఉన్న అంగన్వాడీలను నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వం, అధికార యంత్రాంగం చులకనగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అంగన్వాడీల వేతనాల పెంపు కోసం 42 రోజుల సమ్మె చేసినప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా, రెండు బడ్జెట్లు వచ్చినా వేతనాల పెంపుపై చర్యలు తీసుకోకపోవడం మహిళలను మోసం చేయడమేనన్నారు. ఐద్వా జిల్లా నాయకులు నెరుసుల మాలతి మాట్లాడుతూ వేతనాలు పెంచకుండానే పనిభారం పెంచుతున్నారని, మెడికల్ అలవెన్స్, టిఎ బిల్లులు మంజూరు చేయకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ లేకుండా అంగన్వాడీలను ఖాళీ చేతులతో ఇంటికి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మె ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలేదని, గ్రాట్యుటీపై జారీ చేసిన జీఓ అమలు లక్ష్యాలకు విరుద్ధంగా ఉందన్నారు. రోజురోజుకీ ప్రీ స్కూల్స్‌ను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా ఐసిడియస్‌ను బలహీనపరుస్తున్నాయని దుయ్యబట్టారు. సంఘ నాయకులు ఎస్. గీత మాట్లాడుతూ అంగన్వాడీలపై అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు పెరుగుతున్నాయని ఆరోపించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి. రాము, నాయకులు వి. మోజెస్ మాట్లాడారు. కార్యక్రమంలో బి. నిర్మల, వై. కృష్ణవేణి, పి. క్రాంతి, ఎం. జ్యోతి, లక్ష్మమ్మ, ఉమామహేశ్వరి, ఎల్. శ్రీదేవి, గౌతమి దీక్షలు చేపట్టగా ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం సంతమాగులూరు చెందిన కత్తి బుజ్జమ్మ, అనూష, అమరా గీత, మార్తమ్మ, బి సుగుణ, తిరుపతమ్మ, రమాదేవి, సుస్మిత, భూలక్ష్మి, ప్రభావతి పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

# పచ్చవ సర్పంచ్‌కు పితృ వియోగం

*** పరామర్శించిన కందుకూరు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు**

**కందుకూరు, ఫిబ్రవరి 27 (జాతీయవార్త):** పచ్చవ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండాబత్తిన కృష్ణ తండ్రి రాములు (65) అనారోగ్యం కారణంగా గురువారం రాత్రి మరణించారు. ఆయన పచ్చవ గ్రామానికి విఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. రాములు తన విధి నిర్వహణలో గ్రామంలోనే మంచి పేరు సంపాదించి అందరిచేత మన్ననలు పొందిన వ్యక్తి. సర్పంచ్ ఎన్నికల సమయంలో కృష్ణ గెలుపులో ఆయన కీలకపాత్ర పాత్ర పోషించారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని, ఆయన మరణం మా కుటుంబానికి తీరని లోటు అని సర్పంచ్ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చవ గ్రామ సర్పంచ్ కొండా బత్తిన కృష్ణ తండ్రి గురువారం మరణించిన సంగతి తెలుసుకున్న కందుకూరు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కృష్ణ.. పచ్చవ గ్రామానికి వెళ్ళి పరామర్శించి ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణ కందుకూరులో రిపోర్టర్‌గా పని చేస్తూ కందుకూరు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్నారన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముందు ఉంటారన్నారు. పరామర్శించిన వారిలో కెజెడబ్లుఏ అధ్యక్షులు యర్రంశెట్టి ఆనంద మోహన్, గౌరవ సలహాదారులు గోడపేరు రాము, గౌరవ అధ్యక్షులు నాగభూషణం, ఉపాధ్యక్షులు బొజ్జా చంద్ర మోహన్, సభ్యులు బి సురేష్ బాబు, రవి తదితరులు ఉన్నారు.



## మార్చి 2న సర్వసభ్య సమావేశం

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి27 (జాతీయ వార్త):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వచ్చేనెల 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో వై.శంకరరావు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, సభ్యులు హాజరు కావాలన్నారు.

## నేడు పింఛన్ల పంపిణీ

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి27 (జాతీయ వార్త):** ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో శంకరరావు తెలిపారు. మార్చి1న ఆదివారం కావడంతో ముందస్తుగా పింఛన్లను పంపిణీ చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

## జరుగుమల్లి తహసిల్దార్‌గా వెంకటేశ్వర్లు

**జరుగుమల్లి, ఫిబ్రవరి 27(జాతీయవార్త):** మార్కాపురం జిల్లా పుల్లలచెరువు మండలం తాసిల్దారుగా పనిచేస్తూ సెలవులో వున్న వెంకటేశ్వర్లును కొండేపి నియోజకవర్గం జరుగుమల్లి తాసిల్దారుగా నియమించినట్టు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. జరుగుమల్లిలో పనిచేస్తున్న మురళిని కందుకూరు తాసిల్దారుగా బదిలీ చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546